క్లుప్తంగా

గైనకాలజిస్టును నియమించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఆర్కే 8 కాలనీ కంపెనీ డిస్పెన్సరీల్లో గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ బ్రాంచి ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, మైపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కంపెనీలో మహిళా ఉద్యోగినుల సంఖ్య పెరిగిందని వారి ఆరోగ్య అవసరాల దృష్ట్యా గైనకాలజిస్టును నియమించాలని కోరారు. అంతేకాకుండా 50 పడకల ఆసుపత్రిగా మార్చాలన్నారు. వర్షాకాలం సమీపించినందున కాలనీల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని పేర్కొన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

బెల్లంపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి డివిజన్ డిస్కం డీఈ బి.రాజన్న ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని సెక్షన్, సబ్‌డివిజన్, డివిజన్, ఈఆర్‌ఓ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడిగా రాంనాథ్



నియామకపత్రం అందుకుంటున్న రాంనాథ్

బెల్లంపల్లి: కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బెల్లంపల్లి కన్నాలబస్తీకి చెందిన గజ్జల రాంనాథ్ నియామకమయ్యాడు. ఆదివారం మంచిర్యాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేష్ ఆయనకు నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో నియమించిన ఎమ్మెల్యేలు, నాయకులకు రాంనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



సీఐ అఫ్జలొద్దీన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామంలో మైండ్ మ్యాటర్స్ న్యూరో సైకియాట్రి సెంటర్ మంచిర్యాల మైండ్ మ్యాటర్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బోగె సత్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మానసిక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, తాళ్ల గురిజాల ఎస్సై నరేశ్ హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు రవివర్మ గ్రామీణులకు వైద్య పరీక్షలు చేపట్టి సూచనలు చేశారు. తర్వాత సీఐ, ఎస్సై, వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాలివానకు కొట్టుకుపోయిన పైకప్పు



ఇంటి పైకప్పు కిందపడిన దృశ్యం

చెన్నూర్‌రూరల్: మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షానికి వృద్ధురాలు మీసాల మల్లక్క ఇంటి పైకప్పు కొట్టుకుపోయింది. ఇంటిపై ఉన్న రేకులు పడటంతో మల్లక్క తలపై తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు ఆమెను చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాజారంలో జాతర శోభ

వేమనపల్లి: మండలంలోని రాజారం దశావతార దైవక్షేత్రం మూడు రోజుల జాతరకు ముస్తాబైంది. ఏటా జూన్ రెండో వారంలో రేణుక ఎల్లమ్మ తల్లి ఇల్లారు వద్ద జాతర నిర్వహిస్తారు. ఆదివారం గిరిజన సంప్రదాయ ప్రకారం ఒగ్గు కళాకారులతో కలిసి గ్రామ దేవతలతో ప్రాణహిత నది స్నానానికి గ్రామస్తులు బయల్దేరారు. ఒగ్గు పూజారి బండారు అంజయ్య ఆధ్వర్యంలో ఆటపాట కార్యక్రమం కొనసాగింది. సోమవారం అమ్మవారికి బోనాల కార్యక్రమం, మంగళవారం రథోత్సవంతో జాతర ముగియనుందని గ్రామస్తులు తెలిపారు.

మున్సిపాలిటీలకు భవనాలేవి?

- పాత పంచాయతీ భవనాల్లోనే పాలన
- గదులు సరిపోక సిబ్బందికి ఇక్కట్లు



చెన్నూర్ మున్సిపల్ కార్యాలయం

చెన్నూర్: జిల్లాలో ఏర్పడిన కొత్త మున్సిపాలిటీలకు కొత్త భవనాలు కరువయ్యాయి. పాత పంచాయతీ భవనాల్లోనే పాలన సాగించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో చెన్నూర్, లక్సెట్టిపేట, క్యాతన్‌పల్లి, నస్పూర్ మేజర్ గ్రామ పంచాయతీలను జనాభా ప్రతిపాదికన పరిపాలన సౌలభ్యం కోసం 2018లో అప్పటి ప్రభుత్వం మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసింది. నాలుగు పంచాయతీలు మున్సిపాలిటీగా ఏర్పాటై ఆరేళ్లు కావస్తున్నా నేటికి పాత పంచాయతీ భవనాల్లోనే అధికారులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ కావడంతో సిబ్బంది పెరిగారు. గదులు సిబ్బంది ఉండేందుకు సరిపడ గదులు లేకపోవడంతో ఇబ్బందుల మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

మున్సిపాలిటీల పరిస్థితి..

చెన్నూర్ మున్సిపాలిటీ పాత గ్రామ పంచాయతీ భవనంలో బల్దియా సేవలు అందిస్తున్నారు. కొత్త భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాలేదు. పాత భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని అధికారులు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడి ఐదేళ్లకు పైగా కావస్తుంది. నేటికి కొత్త భవనం నిర్మాణం కాలేదు. పాత పంచాయతీ భవనంలో మున్సిపాలిటీ కొనసాగుతోంది. కొత్త భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు, నిధుల మంజూరు కాలేదు.
- లక్సెట్టిపేట మున్సిపాలిటీ పాత పంచాయతీ భవనంలో కార్యకలాపాలు సాగుతున్నాయి. కొత్త భవన నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపించలేదు. నిధులు మంజూరు కాలేదు.
- నస్పూర్ మున్సిపాలిటీ భవన నిర్మాణానికి గతేడాది సర్వే నెంబర్ 42లో 1.20 ఎకరం స్థలాన్ని కేటాయించారు. నేటికి నిధులు మంజూరు కాలేదు. నిర్మాణం జరగలేదు. కొత్త భవన నిర్మాణానికి పాలకవర్గం ప్రతిపాదనలు పంపించాలని అధికారులను కోరారు.

మున్సిపాలిటీలో 14 విభాగాలకు పైగా..

మున్సిపాలిటీల్లో కమిషనర్, చైర్మన్ చాంబర్‌తోపాటు పాలకవర్గం కూర్చోవడానికి ప్రత్యేక గది అవసరం ఉంటుంది. మున్సిపల్ మేనేజర్, కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేక హాల్, వీడియో కాన్ఫరేషన్ హాల్, సెక్షన్ హెడ్, శానిటరీ గది, కంప్యూటర్ గది, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, ఫిర్యాదుల విభాగాలకు ప్రత్యేక గదులు అవసరం ఉంటుంది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ప్రత్యేక గదులు లేకపోవడంతో ఇబ్బందుల మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు అంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు వస్తేనే..

ప్రస్తుతం పాత భవనంలోనే పాలన సాగిస్తున్నాం. గ్రామ పంచాయతీతో పోలిస్తే మున్సిపాలిటీల్లో సిబ్బంది సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఉన్న గదుల్లోనే నిర్వహణ సాగిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలు వస్తే నూతన భవన నిర్మాణ కోసం ప్రతిపాదనలు పంపిస్తాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్ చెన్నూర్

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్ చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలిశారు. పాఠశాలలో నిర్వహించిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ముందుగా ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనాటి తీపి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కామ రమేశ్ రమాదేవి, సునీత, పవన్, ఓంప్రకాశ్‌లను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



ఎంవీఎస్ డిగ్రీ పూర్వ విద్యార్థులు

ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో..

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో 2008–11 విద్యాసంవత్సరంలో బీకాం కంప్యూటర్ చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నిర్వాహకులు రాకేశ్, విద్యాసాగర్, మహేందర్, మల్లికార్జున్, సాగర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాసిపేట: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత గ్రామాలైన వెంకటపూర్, సోనాపూర్, గట్రావుపల్లి పంచాయతీల పరిధిలోని పల్లెల్లో, కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపల్లిలో యువకులకు ఆదివారం క్రికెట్ కిట్లు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, అంజనేయులు పాల్గొన్నారు.

తాండూర్: యువత క్రీడల్లో రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన నాలుగు మండలాల వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో అంకుశం జట్లే గెలుపొందగా వారికి బహుమతులు అందజేశారు. ఏసీపీ మాట్లాడుతూ యువత చెడు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు రత్నాకర్‌రావు, ఈసా పాల్గొన్నారు.



కాసిపేట: సోనాపూర్‌లో క్రీడాసామగ్రి అందిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తదితరులు

తాండూర్: పోలీసులు మీ కోసంలో భాగంగా కిష్టంపేట, అంకుశం గ్రామ యువకులకు ఎస్సై కిరణ్‌కుమార్ ఆదివారం వాలీబాల్, క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. అదనపు ఎస్సై లక్ష్మణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: పోలీస్ మీ కోసంలో భాగంగా బుధాకుర్దు పంచాయతీ పరిధి కాశిరెడ్డిపల్లెలో యువకులకు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ క్రీడా సామగ్రి అందజేశారు. తాళ్లగురిజాల ఎస్సై గోపతి నరేశ్ పాల్గొన్నారు.

భీమిని: భీమిని మండలం పెద్దపేట, కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి గ్రామాల యువకులకు ఎస్సైలు విజయ్‌కుమార్, గంగారాం ఆదివారం క్రీడా సామగ్రి అందజేశారు. పోలీసులు ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీత

జైపూర్: మండలంలోని దుబ్బపల్లి బస్టాండ్ ప్రాంతంలో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న వ్యక్తిని నేతకాని సంఘం నాయకులు చేరదీశారు. క్షౌ వరం తీయించి శుభ్రంగా స్నానం చేయించి కొత్త బట్టలు ధరించారు. కాళ్లకు చెప్పులు, భోజనాన్ని అందజేశారు. ఫాదర్స్ డే సందర్భంగా మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తికి బట్టలు, చెప్పులు, భోజనం అందించామని నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో రమేశ్, శేఖర్, ఉపేందర్, రాకేశ్, రాంబాబు, శ్రీనివాస్, తిరుపతి, రవి, కిరణ్, రంజిత్, కృష్ణ, సోనాల్‌శర్మ పాల్గొన్నారు.

మందుబాబుల అడ్డా

- బహిరంగ ప్రదేశాలు, మైదానాల్లో హల్‌చల్
- తాగిపడేస్తున్న మద్యం సీసాలు, బాటిళ్లు



మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మందుబాబులు తాగి పడేసిన బీరుసీసాలు



మంచిర్యాల ప్రభుత్వ బాలుర పాఠశాలలో మైదానంలో స్టేజీ వద్ద తాగి పడేసిన బీరు సీసా

మంచిర్యాలక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ శ్రీనివాస్ హెచ్చరిస్తున్నా మందుబాబులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాళ్లవాగు సమీపంలో మైదానాలు, కాలేజీరోడ్, శివాజి గ్రౌండ్, హైటెక్‌సిటీ వెనుకల, రైల్వేస్టేషన్ ఏ క్యాబిన్, మైసమ్మ గుడి వద్ద క్వారీరోడ్ మైదానాల్లో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. రాత్రిసమయంలో హల్‌చల్ చేస్తున్నారు. మద్యం తాగి బాటిళ్లు, సీసాలు పగలగొట్టి, తినుబండారాలు చిందరవందరగా పడేస్తున్నారు. ఉదయం మైదానాల్లో వచ్చే క్రీడాకారులు, వాకర్స్‌కు ఇబ్బందికరంగా మారింది. బాలుర పాఠశాల మైదానం పక్కనే సాయిబాబా మందిరం, గ్రౌండ్‌కు రెండు వైపులా జాఫర్‌నగర్, హైటెక్‌సిటీ కాలనీలకు వెళ్లేందుకు రోడ్లు ఉన్నాయి. అటువైపు వెళ్లడానికి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళ కొందరు మందుబాబులు సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని గొడవకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

మద్యం మత్తులో నేరాలు..

- జిల్లాలో కొందరు యువకులు మద్యం, గంజాయికి బానిసలై నేరాలకు పాల్పడుతున్నారు. దారి దోపిడీ చేస్తూ అలజడి సృష్టిస్తున్నారు. ఇటీవల కాలేజీరోడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న ఓ టీస్టాల్ వద్ద మద్యం మత్తులో ఓ యువకుడు వస్తువులను చిందరవందర చేశారు. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.
- ఇటీవల రైల్వేస్టేషన్ సమీపంలో ట్రైన్ దిగి వెళ్తున్న పెద్దపెల్లికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి సెల్‌ఫోన్, రూ.5 వేలు నగదు దోచుకున్నారు.
- ఈనెల 4న జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్‌లో మద్యం మత్తులో రెండు వర్గాలు దాడులు చేసుకున్నాయి. పోలీసుల ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు. రాత్రి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాఠశాల మైదానాల వద్ద దృష్టిసారిస్తాం. పెట్రోలింగ్ టీమ్‌లు, పోలీసులతో నిఘా ఏర్పాటుచేస్తాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రధాన రోడ్లపై రాత్రివేళ గుంపులుగా గూమిగుడితే కేసులు నమోదు చేస్తాం.

– బన్సీలాల్, సీఐ, మంచిర్యాల



ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్త

ఎంసీహెచ్..దుర్గంధం



మెట్ల మీద పేరుకుపోయిన చెత్త

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గోదావరి ఒడ్డున గల మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో అపరిశుభ్రతతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆస్పత్రిలోని రెండో అంతస్తు నుంచి తిన్న ఆహారంతోపాటు, ఇతరత్రా చెత్తను కిందకు పడేయడంతో కిటికీలపై ఉన్న స్లాబ్ మీద పడి రోజుల తరబడి ఉంటోంది. మెట్లపై చెత్తాచెదారం ఉంటుంది. గర్భిణులు, బాలింతలు, అప్పుడే పుట్టిన చిన్నారులు ఉండే ఈ ఆస్పత్రిలో అపరిశుభ్రతతో కొత్త వ్యాధులు ప్రబలే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాకాలం కావడంతో, ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.



పగిలిన తాగునీటి పైపులు



మంచిర్యాలటౌన్: పట్టణంలో తాగునీటి పైపులు పగిలిపోయి అందులో మురుగునీరు చేరి కింది ప్రాంతాలకు సరఫరా అవుతోంది. ఆ కలుషిత నీటిని ప్రజలు తాగుతున్నారు. గత కొంతకాలంగా పట్టణంలోని పైపులు తరచూ పగిలిపోవడం, మరమ్మతు పేరిట తవ్వి రోజుల తరబడి వదిలేయడంతో మురుగునీరు పైపుల్లో చేరుతోంది. వర్షాకాలం కావడం, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు కలుషిత నీటిని తాగడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రాణహితలో అరుదైన చేపలు

వేమనపల్లి: వేమనపల్లి సమీపంలో ప్రాణహిత నదిలో జాలర్లకు ఆదివారం అరుదైన చేపలు లభ్యమయ్యాయి. నలుపు, పసుపు వర్ణంతో పట్టుకుంటే జారిపోయే గుణంతో ఉన్న బండపాకురు చేపలు ఆకర్షణీయంగా ఉన్నాయి. మాంసప్రియులు ఎగబడి వీటిని కొనుగోలు చేశారు.



లభ్యమైన బండపాకురు చేపలు

వరుణుడి కోసం ఎదురుచూపు



కిష్టంపేట వద్ద పత్తి విత్తనాలు పెడుతున్న మహిళలు



లింగంపల్లి సమీపంలో విత్తనాలు పెట్టిన చేను

- ఇప్పటికే విత్తనాలు విత్తిన రైతులు
- వాన జాడ లేక ఆందోళన
- తగ్గని ఎండలు

చెన్నూర్‌రూరల్: వరుణుడి రాక కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. మృగశిర కార్తె వచ్చి సగం రోజులు గడుస్తున్నా ఎండలు మాత్రం తగ్గడం లేదు. కొందరు రైతులు పొలాలను దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు. మరికొందరు విత్తుకున్నారు. ఈనెలలో ఇప్పటివరకు వరుణుడు జాడ లేకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుండడం, రాత్రివేళ చల్లనిగాలులు, పగలు ఎండతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సిద్ధమైన రైతులు ఎండకు మొలకెత్తుతాయో లేదో అనే సందేహంలో పడ్డారు. జిల్లావ్యాప్తంగా 1.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. చెన్నూర్ మండలంలో వరి కన్నా ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. మండలంలో ఇప్పటికి 30 శాతం రైతులు పత్తి విత్తనాలు విత్తుకొని వర్షం పడితే మొలకెత్తుతాయని చూస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.1700 వరకు విత్తనాలు కొనుగోలు చేసి మరి విత్తారు. ఎండలు ఇలాగే ఉంటే పత్తి సాగు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఉంది. ప్రతీరోజూ ఏదో ఒక చోట వర్షం కురుస్తున్నా మండలంలో వర్షం కురవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరుణుడి కరుణిస్తేనే పంటల సాగవుతుంది. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ఎదురుచూస్తున్నాం



దుక్కులు దున్ని విత్తనాలు విత్తి వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. విత్తనాలు విత్తి వారం రోజులవుతుంది. వర్షాలు కురిస్తేనే పంటల సాగు అవుతుంది. లేదంటే నష్ట పోవాల్సి వస్తుంది.

– గట్టయ్య, రైతు, లింగంపల్లి

రైతులు తొందర పడొద్దు



వర్షాలు ఇంకా కురవడం లేదు. రైతులు తొందరపడి వరి, పత్తి విత్తనాలు వేయొద్దు. ఎండలు బాగానే ఉన్నాయి. అదునుపదును చూసి మాత్రమే విత్తనాలు విత్తాలి. వర్షం కురిశాక తడి నేలలో విత్తనాలు విత్తుకోవాలి.

– శ్రీనివాస్, ఏవో, చెన్నూర్

భీమారంలో భారీ వర్షం

భీమారం: మండల కేంద్రంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. బస్టాండ్ ను ంచి ఎస్సీ కాలనీకి వెళ్లేదారిలో రోడ్‌డ్యామ్ పై నుంచి నీళ్లు పొంగి ప్రవహించాయి. సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.